
# ★ ★ ★ పుస్తక జ్ఞానం ★ ★ ★

శ్రీ గోపీచందు



౪

అంధకారం. కారుమబ్బులు వర్షం కురవటానికి ప్రయత్నిస్తున్నాయి. చలిగాలి వీస్తోంది. సుబ్బారావు ఇంటివెనుక తోటలోకి గోపీ అంజీని చెయ్యి పట్టుకొని తీసుకొని పోతున్నాడు. అంజీ యంత్రంవలె అతనిని అనుసరించి పోతున్నాడు. గోపీ ఆగి, 'అదుగో కనబడుతోందే వెలుతురు; అక్కడికి...అక్కడే హంతకులు గుసగుసలాడుతున్నారు. రాహువు పట్టు పట్టాలి. ఉడుముపట్టు పట్టుకోవాలి,' అన్నాడు. అంజీ హృదయం దడదడ లాడింది. 'వ్వారా హంతకులు,' అని గునిసాడు. గోపీ వినిపించుకోకుండా అతనిని లాక్కొని పోతున్నాడు... ఆ వెలుతురు సుబ్బారావు గదిలోనుంచి వస్తోంది. ఆ గది తలుపులు తెరిచే ఉన్నాయి. అంజీ తొంగి చూశాడు. గదిలోని దీపం ఒయ్యారంగా తన సొంపును విరజిమ్ముతోంది. నీడలు గోడల మీదపడి, పార్టీలు మార్చుకునే రాజకీయ వేత్తవలె, వికారంగా కదులుతున్నాయి. ఆగదిలోని వ్యక్తులనుచూచి అంజీ ఆశ్చర్య చకితుడయినాడు. ఏనాడో అదృశ్య శరీరుడైన సీతారాముడు...' ఆలోచన తెగిపోయింది. లోపలనుంచి సుబ్బారావు మాటలు వినిపించాయి.

'మన సంగతి పొక్కదు. అంజీ కుమ్మరిపురుగు విధాన తంటాలుపడుతున్నాడు. కాని లాభంలేదు. అతనికి ప్రతిమనిషినీ అనుమానించటం తప్ప ఏమీ తెలియదు. ప్రస్తుతం తన్నుతానే అనుమానించుకుంటున్నట్లు వదంతులు బయలుదేరాయి'

'అతనివల్లనే నాకీ అవస్థ వచ్చింది. అతని అజ్ఞానమే నాకొంప నిలువున తీసింది,' అన్నాడు సీతారామయ్య.

'ఏమీ భయం లేదు. నా మాట విశ్వసించు. అపాయం చెయ్యగలశక్తి అతనికిలేదు. అతడు మూఢుడు. అతడు...'

అంజీ క్రోధాన్ని ఆపుకోలేకపోయాడు. గోపీ వారిస్తున్నా, వినకుండా, గది మధ్యకు కుప్పించి దూకి, 'ఓరోరీ, మీరు సూర్యచంద్రుల నుంచీ, స్త్రీల చూపులనుంచీ తప్పించుకోగలరేమోగాని, ఈ అంజీనుంచి తప్పించుకోలేరు. నేటితో మీపాపం పండింది. ఈ అంజి...'

'ఏమిటా వెర్రిపోజులు? దయచేసి కూర్చో,' అన్నాడు సుబ్బారావు. సీతారామయ్య నవ్వాబోయి దగ్గాడు. దీపం వెక్కిరిస్తున్నట్లు మెలికలు మెలికలు తిరిగింది. అంజీకి భయం వేసింది. తాను చదివిన నవలలోని దృశ్యాలన్నీ గిర్రున బుర్రలో తిరిగాయి. వారు ఏ మీట నొక్కి అదృశ్య మౌతారో, తన్ను ఏ పాతాళ గృహంలోకి తోస్తారో, అని గాభరా పడ్డాడు.

'చాలా సేపటినుంచీ నీకోసమే చూస్తున్నాము, కూర్చో,' అన్నాడు సుబ్బారావు.

అంజీ ధైర్యం తెచ్చుకుని, 'సుబ్బారావ్, జాగ్రత్త నీ మర్యాదలు సహించి ఊరుకొనుటకు, నేనిప్పుడు నీ అతిథినికాదు. మాట్లాడక నాతో బయటకురా,' అన్నాడు.

అతడు విసుగుదలతో, 'కూర్చోవయ్యా దేముడా! నీతో అనేకం మాట్లాడాలి. ఈ చిందు లేమిటి? ఈ హట్టహాస మేమిటి? నీకేమైనా పిచ్చి...'

అంజీ నిజంగా ఉన్మత్తుడైనాడు. 'కావలసింది పోలీసులే చెప్పించుకుంటారు. తక్షణం బయలుదేరు, లేకపోతే విజిల్ వేస్తా. పిస్తోలుతీస్తా ఇంకేమేమో చేస్తా. గోపీ,' అని పిలిచాడు.

'అడుగో పోతున్నాడు,' బయటికి వేలితో చూపిస్తూ అన్నాడు సీతారామయ్య.

అప్రయత్నంగా వెనుదిరిగి చూశాడు అంజి. వెంటనే తలుపులు గభాలున వేసినధ్వని, నవ్వుల ధ్వని అతనిచూపులను త్రిప్పాయి. సుబ్బారావు సీతారామయ్యలు అక్కడలేరు. సమయం కనిపెట్టి ప్రక్క ద్వారంలోనుంచి లోనికిపోయి గడియ వేసుకున్నారు. 'మోసం, మోసం,' అని కేకలువేసి ఛర్రునకోడెత్రాచువలె లేచి, ఆ తలుపులను దబదబ తన్నాడు. ఆతన్నుల ధ్వనిలో లోపలనుంచి సన్నసన్న దారులనుంచి వచ్చే నవ్వులధ్వని లీనమైపోయింది. ఆ తలుపులు బ్రద్దలుగొట్టే ప్రయత్నంలో గోపీ అంజికి సహాయం చేశాడు. ఇద్దరి మధ్యా అవి విడిపోయినవి. అంజీ కోదమసింగము లాగు ఆరెండోగదిలోకి దూకాడు. కాని అక్కడ ఏమున్నది? శూన్యమున్నది. అతడు నిరాశచెందక, గుప్త ద్వారములుగాని, పాతాళ గృహ ద్వారములుగాని ఉన్నవేమోనని ఆ గదిని కలయవెదికాడు... ఒక మూల భూమిలో బిగించబడిన రాయి ఒక్కటి కనుపించింది. వెంటనే ప్రక్కనున్న ఇనుపకడ్డీనొకదానిని తీసుకొని దానిని త్రవ్వనారంభించాడు.

గోపీ దీపం పట్టుకొని, నిలువుగ్రుడ్లు వేసి అంజీనిచూస్తూ నిలబడ్డాడు. అంజీ రెండు చేతులకు బొబ్బలెక్కాయి. స్వేద బిందువులతో త్రవ్వబడే రాయి తడిసిపోయింది...కష్టము ఫలించింది ఆ రాయి కదిలింది...దానిని పైకితీసి చూచి, అంజీ,'హా,' అని ఆశ్చర్యంగా కేకవేశాడు. ఆరాయిక్రింద గట్టి నల్లనిభూమి తప్ప మరేమీ లేదు. అంజీ హృదయమును పదిలపరచి ఆభూమిని త్రవ్వ నారంభించాడు. గోపీ ఇక ఓపిక పట్టలేక, 'ఏమి టిదంతా?' అన్నాడు.

'ఈగదికి రెండే ద్వారములున్నవి. ఒకటి మనము ప్రవేశించింది. రెండోది బయట గడియ వేసిఉంది. వీరు ఎలా అదృశ్యమైనారు?'

గోపీ విరగబడినవ్వి, 'అదా సంగతి! బాగానే ఉన్నది. ఇంటికి పోదాంరా. వారీ గది ప్రవేశించినప్పుడు ఆ తలుపులు తీసే ఉన్నాయి. వారు దానిగుండా బయటకువెళ్ళి గడియవేశారు,' అన్నాడు.

అంజీ సిగ్గుపడ్డాడు. వివాహం సంగతి కదిపినప్పుడు సిగ్గుపడే కన్యకంటే పదింతలు సిగ్గుపడ్డాడు.

౫

'అంజీగారూ, రాత్రి మీరు త్వరపడ్డారు. ఇప్పుడైనా మించిపోయింది లేదు. పగను పామైనా మరచిపోతుంది గాని, భామిని మరచిపోలేదు. తమరీ విషయంలో అత్యంత శ్రద్ధ తీసుకోవాలి.' అన్నది జలం.

'నేనూ అదే ఆలోచిస్తున్నాను. కాని వాళ్ళే హంతకు లయినట్లు మనకు నిదర్శనాలు దొరకలేదు. తీరా కోర్టులో నిరూపించ లేకపోతే, కేసు ఎదురుతిరిగి గొంతుకు లుంగ వేసుకుంటుంది. అందుకని వస్తాయిస్తున్నాను.'

'నిదర్శనాలుంటే,' అన్నాడు గోపి.

'ఉంటే తక్షణం నాపని పూర్తి చేస్తాను. నా స్నేహితుని హత్య

చేసిన వానిని ఉరితీయించి, నా ధర్మమును నెరవేర్చుకుంటాను.'

'సుబ్బారావు భాస్కరరావులు ప్రాణ విరోధులని లోకానికి తెలుసు. ఇక సీతారామయ్య నా దగ్గరేగా జలజానికి శృంగభంగం చేస్తానని ప్రతిజ్ఞ పట్టింది. తన విరోధమువల్ల సుబ్బారావు, తన పగ సాధించుకొనుటకు సీతారాముడు భాగస్వాములై చెరొక పనిచేసి గాని, చేయించి గాని ఉంటారు. ఈ రెండు విషయాల్లో నేను సాక్ష్యం చెబుతాను.

అంజీ పత్తేదారీ నవ్వు నవ్వి, 'గోపీ నీది మిక్కిలియుం బలమైన సాక్ష్యం. యదార్థవాది తరపు సాక్ష్యం ఇలాగే ఉంటుంది. కాని కోర్టులో కత్తిలేని పప్పు ఉడకదు.'

'నిదర్శనాలు పోగుజెయ్యటానికి పత్తేదారుని నియమిస్తే బాగుంటుందనుకుంటాను,' అన్నది జలజం అంజీని చూస్తూ.

గోపీ మాట్లాడలేదు. అతని అంగీకారం లేకుండానే పత్తేదారుని నియమించాలని నిర్ధారణ చేసుకున్నారు.

'ఈపని ప్రథమంలోనే చేస్తే బాగుండేది. ఇన్నాళ్ళు ఎందుకు ఊరుకున్నారు?' అడిగాడు అంజి.

'మీరు అత్యంతశ్రద్ధతో ప్రయత్నిస్తున్నారు గదా! మధ్యలో ఇంకొకరిని తీసుకొని వస్తే మీరేమైనా అనుకొని పోతారేమోనని ఊరుకున్నాను,' అన్నది జలజం.

అంజీ బిడియపడ్డాడు. 'సరే, వెళ్తాం, పత్తేదారు రాగానే మాకు కబురుచేయండి.'

అంజీ గోపీ లిద్దరూ వెళ్ళి పోవుటకు లేచారు. వారిని అమిత మర్యాదగా బయటకు సాగనంపివచ్చి, సోఫామీద పడి గుక్కలుపెట్టి నవ్వటం మొదలు పెట్టింది, జలజం. ప్రక్క గదిలోనుంచి పిల్లి లాగువచ్చి ఎదురుగా కూర్చున్నాడు సుబ్బారావు. నవ్వుతూనే, 'సంగతి విన్నారా? మిమ్ములను బంధించుటకు పత్తేదారుని దిగుమతి చేయిస్తున్నాము,' అన్నది జలజం.

'మంచిది,' అన్నా డతడు.

'పుణ్యం తరిగీ
పాపం పెరిగీ
ప్రళయం వస్తుంది' అన్నది.

'మంచిది,' అన్నాడు.

'సరేగాని, సీతారామయ్యగారి శరీరస్థితి ఎలా ఉన్నది?

'విషం తల కెక్కింది. ఎక్కువ రోజులు బ్రతుక డేమో?'

'అయిదారు దినాల్లో' మన పని పూర్తి అవుతుంది. అంతవరకు పరవా లేదనుకుంటాను. పాపం, చేతులారా తెచ్చుకున్నాడు,'

'అవును.'

'ఇక సరసిజం. అది రేపు తేలుతుంది. అప్పుడు ఉచ్చులన్నీ బిగిద్దాము. త్వరపడితే అమృతం విషమవుతుంది,' అన్నది.

'జలజం?' బయటనుంచి గోపీ పిలిచాడు,

'సుబ్బారావుగారూ, దొరవారు తిరిగి వచ్చినవారై ఉన్నారు. మీరు కొంచం తొలిగివెయ్యాలి,' అన్నది చిరునవ్వుతూ.

సుబ్బారావు లోనికి వెళ్ళగానే, జలజం తలుపుతీసి గోపీని చెయ్యి పట్టుకొని తీసుకొనివచ్చింది. ఇద్దరూ చెరొక కుర్చీలో కూర్చున్నారు.

'కాఫీ తెప్పించనా?'

'మహా భాగ్యం.'

'ఇందాకే ఉండిపోతే కాకపోయిందా? ఇప్పుడు ఎక్కడికి వెళ్ళారు. ఎప్పుడూ ఒక్కటే తిరుగుడు, చెబితే వినరు.'

'అంజీని పంపించాను. అతడు వెళ్ళేటప్పుడు, నేను దిగబడితే బాగుండదుచూడూ,' అన్నాడు.

'బాగుండనిది సంఘానికి! మీకూ నాకూ కాదు. సంఘానికి మంచి పని ఏదీ బాగుండదు. దాని సంగతి నాకెందుకు? దువ్వెన తలకు, విసనకర్ర శరీరానికి, అద్దం మొహానికి ఎంత అవసరమో నీవు నాకంత అవసరం.'

గోపీ లోపల లోపల కులికాడు. వంటవాడు కాఫీ బల్లమీద ఉంచి పోయాడు. జలజం కాఫీ కప్పులో పోస్తోంది.

'సరసిజం ఎక్కడ,' అన్నాడు గోపీ.

'ఆ గదిలో ఉంది,'

'బొత్తిగా కనుపించటం లేదు?'

'గదిలోనుంచి బయటికి వస్తేగా!'

'అన్నగారు పోయారని దిగులు కాబోలు.'

'ఊఁ, దిగులు. అన్నగారి మీద ప్రేమ కారిపోతోంది,' మూతి మునగ దీసి, కాఫీ సర్దటం కొంచం సేపు ఆపి, చేతులు ఒయ్యారంగా త్రిప్పుతూ అన్నది. గోపీ తనకప్పు తీసుకొని కాఫీ రుచి చూచి, గ్రించాడు.

'మొన్న మీరు వ్రాసిన వ్యాసం అద్భుతంగా ఉంది', అన్నది.

'మొన్న వ్యాసమేనా?'

'మీ రేది వ్రాసినా అలాగే ఉంటుంది. మీ వ్రేలి చివర సరస్వతి ఉంది. మీ ఒక్కొక్క వ్యాసాన్ని చిదిపి దీపం పెట్టవచ్చు.'

'మీ ఆరాధకుడను నేను. నేనేది వ్రాసినా మిమ్మలను మనస్సులో పెట్టుకొని వ్రాస్తాను. అప్పుడు నే నేది ముట్టుకున్నా బంగార మవుతుంది.'

ప్రక్క గదిలో అలుకు డయింది.

'ఎలుక' అన్నది.

'కాదు. దేవుడు. స్త్రీ పురుషు లిద్దరు ప్రేమించు కోవటం అతగాడు చూచి ఓర్వలేడు.'

ఇద్దరూ మురిపెంగా నవ్వుకున్నారు. గోపీ అర్థ సహితంగా నవ్వా ననుకున్నాడు.

౬

'మరి భాస్కర్రావుశవం మీ గది గుమ్మం దగ్గరే పడి ఉంది. నాకేమీ తెలియదని మీరంటున్నారు. మీ అన్నగారి ఆత్మశాంతికై ప్రయత్నించవలసిన బాధ్యత మీమీదవుంది. యదార్థం చెప్పండి,' అన్నాడు పత్తేదారు. జలజం సరసిజం ప్రక్కన కూర్చొని శ్రద్ధగా ప్రశ్నోత్తరాలు ఆలకిస్తోంది. అంజీ గోపీలు కొంచందూరంగా కూర్చొని సంభాషణ వింటున్నారు.

'చెబుతాను, కాని ముందు ఈ ప్రశ్నలు వెయ్యటానికి మీ కేమి అధికారముందో చెబుతారా?' అని ప్రశ్నించింది సరసిజం.

'నేను పత్తేదారుడను,' తేనె తుట్టెవలె ఉన్నతన నల్లని గడ్డమును సవరించుకుంటూ చెప్పాడు. 'నేను పత్తేదారుడను. ఇట్టి రహస్యములను భేధించి, హంతకులను బంధించి, ప్రజల శాంతికొరకు పాటుబడుటకు జీవితమును అర్పించిన...' (వీరుడనో, ధీరుడనో అందామనుకున్నాడు.)

'తమరి నామధేయం?'

'పీయూషనాధఛటోపాధ్యాయుడు.'

సరసిజం పరిహాసముగ కనుబొమ్మలు ఎగురవేసి, 'మీరు మీ వృత్తికి అనుకూలముగ ఇటీవలనే పేరు మార్చుకున్నా రనుకుంటాను. లేకపోతే జన్మించటమే ఈ గడ్డంతోనూ, ఈ పేరుతోనూ జన్మించారా?'

పీయూషనాధఛటోపాధ్యాయుల వారికి కోపం వచ్చింది. (అంజీ ముసిముసి నవ్వులు నవ్వుకున్నాడు.) 'మీరు ప్రత్యుత్తరములు ఆలోచించుకొనుటకై యీ సమయమును, సంగతిని మరపించుటకు, ప్రయత్నిస్తున్నారు. నేను 20 సంవత్సరములనుంచీ, ఈ వృత్తిలో పని చేస్తున్నాను. నాకీ వృత్తిలోనే గడ్డం నెరియబోతోంది. కనుక దయచేసి, మీ బుద్ధి చాతుర్యమును ప్రకటించే ప్రయత్నం చెయ్యక నే నడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పండి.'

'అడగండి, చూద్దాం.'

'భాస్కరుడు హత్య చేయబడింది మీ గదిదగ్గరే! అతని శవం మీ గది గుమ్మం మీదే పారవేయబడి ఉంది.'

'ఒక్క భాస్కరునిదే కాదు. మా అన్నగారి శవం నాగది దగ్గరే పడిఉంది నేనా భయంకర దృశ్యం చూడలేక పోయాను. ఈ ఊళ్ళో భాస్కరునికి నా తలలో వెంట్రుకలంత మంది విరోధు లున్నారు. మా అన్నగారికి (భార్య తరఫునైనా) విరోధే లేదు. అందుకనే (మా అన్నగారికి విరోధే లేకపోవటం వల్ల,

భాస్కరునికి పెక్కుమంది విరోధులుండటంవల్ల) హంతకుడు తేలటం లేదు.'

'మీరా రాత్రి గదిలో లేరు కాబోలు! దానికి మీరేమి చేస్తారు? కాని...'

'రాత్రులు షికారు వెళ్లటం నాకు అలవాటే! అందులో చీకటి రాత్రులంటే నాకు మల్లెపువ్వులంత ఇష్టం. (అంజీ ఆశ్చర్యంగా, ఆనందంగా చూస్తున్నాడు) కాని ఆనాడు మాత్రం, అదృష్టవశాత్తో, దురదృష్టవశాత్తో గదిలోనే ఉన్నాను.'

'ఏం చేస్తున్నారు?'

సరసిజం చిలిపిగాచూచి, 'అర్థం లేని ప్రశ్నలు వేస్తున్నారు. పీయూషనాథఘటోపాధ్యాయుల వారు వేయ వలసిన ప్రశ్నలు కావివి.'

'క్షమించాలి'

'చదువుతున్నాను' పత్తేదారు ఏదో అడగాబోయాడు. సరసిజం గ్రహించి, '12గంట లవుతుంది' అన్నది.

'వెంటనే నిద్రపోయారా?'

'కలత నిద్ర పోయాను. నేను విమానంమీద స్వర్గలోకం వెళ్ళినట్లు, అక్కడ ఇంద్రుడు, నీకిక్కడ పుస్తకాలు దొరకవు, నరకానికి పొమ్మని త్రోసివేసినట్లు, ఇంకేమేమో కలలు కన్నాను'

అంజీ 'పాపం' అనుకొని నిట్టూర్చాడు. గోపీ తదేక దృష్టితో చూస్తున్నాడు. జలజం తల దిమ్మెక్కిపోతోంది.

'అయితే మీకా రాత్రి ఏవిధమయిన ధ్వని (చివరికి ఆర్తనాదమయినా) వినిపించలేదా? (బిగ్గరగా) నిజం చెప్పండి. లేకపోతే కేసు మీ మీద విరుచుకొని పడుతుంది.'

'పత్తేదారుగారూ...' అని ఏమో చెప్పబోయాడు అంజి.

'మీరు ఊరుకోండి,' అని అదలించాడతడు.

'అంజీగారూ, మధ్య మీకెందుకు? (ప్రత్తేదారు వైపు తిరిగి) కేసు నామీద విరుచుకొని పడేదీ లేందీ, (అసలు కేసుకు విరిగే గుణమున్నదీ లేందీ) నాకు తెలుసు. ఈ వ్యర్థ ప్రలాపములవల్ల ప్రయోజనం లేదు. నాకు ఆరాత్రి ఏవిధమయిన ధ్వని (చివరికి ఆర్తనాదం) వినిపించలేదు.'

'యథార్థం చెప్పరా? లేకపోతే కష్టాల పాలవుతారు. 12 గంటలకు హత్యలు జరిగాయి; 12 గంటల వరకు మీరు మేలుకొని ఉన్నారు. తరువాతయినా మీరు నిద్రపోలేదు. 'స్వర్గం' 'నరకం' కలలు కంటున్నారు. యదార్థం చెప్పండి. ఇప్పటికీ మించిపోయింది లేదు. ఉన్నదున్నట్లు చెబితే మిమ్మలను కాపాడే భారం నాది,' అన్నాడు సునిశిత దృష్టులతో.

'యదార్థం చెప్పించుకునే శక్తియుక్తులు మీలో లేకపోయినా, అన్నగారి యందున్న ప్రేమచేత, యదార్థము చెబుతున్నాను. నాకు ఏ ధ్వనీ (చివరికి ఆర్తనాదమయినా) వినబడలేదు.'

'పత్తేదారుకి పౌరుషం (దాంతో కోపం) వచ్చింది. మీ నోటితోనే చెప్పిస్తాను. నా శక్తి అప్పుడుగాని మీకు బోధపడదు...సీతారామ్!'' అని కేకవేశాడు. అంజీ ఆశ్చర్యంతో నోరు తెరుచుకొని చూస్తున్నాడు. గోపీ, జలజాలలో విపరీతమైన మార్పు లేమీ గోచరించలేదు. సరసిజం చిలిపినవ్వు నవ్వింది. చిక్కి శల్యావస్థలో ఉన్న సీతారామయ్య దగ్గుకుంటూ వచ్చి కూర్చున్నాడు.

'మీరు చెబుతారా? లేకపోతే వీరిచేత చెప్పించుకోమంటారా?'

'మీకు కావలసిందంతా వారి చేతే చెప్పించుకోండి. నాకా కాళరాత్రి ఏదైనా ధ్వని (చివరికి ఆర్తనాదమయినా) వినిపించిందో లేదో ఆయనచేతే చెప్పించుకోండి,' అంది సరసిజం.

పత్తేదారుకి ఏమీ తోచలేదు. అంజీవైపు తిరిగి, 'త్వరపడి పనులు చేసే స్వభావంకాదు నాది. ఈమెకు ఆలోచించుకొనుటకు కొంతసైము ఇస్తాను. (సరసిజం వైపు తిరిగి) మీరు దీర్ఘముగ ఆలోచించుకొని

ఏసంగతీ రేపు నాకు చెప్పండి,' అన్నాడు.

'ఆనాడు వినిపించని ఆర్తనాదం, నాకు రేపు వినిపిస్తుందా?' అన్నది సరసిజం.

పత్తేదారు నిప్పులమీద కూర్చున్నట్లయి, అక్కడ ఉండలేక పోయాడు. లేచి, 'అంజీగారూ, హత్యలు జరిగినచోటు చూడాలి,' అన్నాడు.

సరసిజం పక్కన నవ్వి, 'హత్యలు జరిగి ఆరునెల లయింది. మీ రిప్పుడేమిచేసినా వృథా మొరుగుడవుతుంది. ఆనాడే అంజీ గోపీగార్లకు ఏమీ దొరకలేదు,' అన్నది.

కాని జలజం ఆ ప్రదేశానికి దారి తీసింది. పత్తేదారు పెదవి మెదల్పకుండా ఆమెను అనుసరించాడు. గోపీ జారుకొనుటకు ప్రయత్నిస్తుంటే పత్తేదారు, 'తమరు దయచేయ్యాలి. తమరు లేకపోతే కర్ణుడు లేని భారతమవుతుందక్కడ,' అన్నాడు. అంజీ సరసిజం దగ్గరకు వచ్చి, 'వస్తారా,' అని ఆప్యాయనంగా అడిగాడు. 'మీరు అడగకపోతే వచ్చేదానను, ఇప్పుడు రాను,' అన్నది. అంజీ ఇంత మొహం చేసుకున్నాడు; మిగిలిన వారిని అడుగులలో అడుగులు వేసుకుంటూ అనుసరించాడు. అందరూ హత్యలు జరిగినచోటికి వెళ్ళారు.

పత్తేదారు ఆప్రదేశాన్ని శల్య పరీక్ష చేశాడు. కాని ఒక కన్ను ఎప్పుడూ గోపీ అంజీలమీదే ఉంచాడు. 'ఇదిగో, ఒక కాన్సీ, ఒక ప్రక్క అరిగిపోయింది. ధిక్! ఇదిగో, ఒక పాళీ. ఒక ప్రక్క విరిగిపోయింది. ధిక్! ఇదిగో ఒకగుండు సూది. బాగా వంగిపోయింది. ధిక్! అంటున్నాడు. అందరూ గారడి వానిని చూచినట్లు చూస్తున్నారు. ఉండి, ఉండి, అగస్మాత్తుగ అతడు, 'నేను వచ్చినపని నెరవేరింది. హంతకుడు పట్టుబడ్డాడు. ఇక వెళ్ళాం పదండి,' అన్నాడు.

'ఎవ్వరు? ఎవ్వరు?' అని ఆత్రుతతో అడిగింది జలజం

'చెప్పమంటారా?'

'చెప్పాలి,' అంది జలజం.

'ఊఁ,' అన్నాడు అంజి.

'ఏమంటారు?' అని అడిగాడు గోపీని పత్తేదారు.

'చెప్పండి,' అన్నాడతడు.

'ఎందుకులే' అయిదు రోజులలో అతనిని మీ చేతికి అప్పగిస్తాను.' అన్నాడు పత్తేదారు.

జలజం అంజీలు నిరాశా పూరిత నేత్రాలతో ఒకరిమొహం ఒకరు చూచుకున్నారు. గోపీ తలను వంచుకొని భూమిలోకి చూపులను గ్రుచ్చాడు. సీతారామయ్య దగ్గాడు.

---

ఇంతవరకు హంతకు డెవరో

మీరు గ్రహించలేదు.

సరసిజం కర్ర విరుపు తత్వం అగమ్యగోచరంగావుంది. జలజం గురించి

యేమని అభిప్రాయ పడడానికీ వీలులేదు.

ముందు సంచికలో యీచిక్కు విడుతుంది.